

ఆసిఫాబాద్‌లో దండారీలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు


నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | ఆదివారం 22 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## పశువులపై పులి దాడి

▼ సిర్పూర్(టీ) మండలం ఇటిక్యాల పహాడ్ సమీపంలోని ప్లాంటేషన్‌లో పులి అడుగులు



కౌటాల, డిసెంబర్ 21 : సిర్పూర్(టీ) రేంజ్ పరిధిలో మేతకు వెళ్లిన పశువులపై శనివారం పులి దాడి చేసింది. మాలిని గ్రామ సమీపంలో ఒక పశువు, మేడిపల్లి గ్రామ శివారులో మరో పశువుపై పులి దాడి చేసి గాయపరిచింది. పశువుల కాపరులు కేకలు వేయడంతో పులి పారిపోయినట్లు వారు తెలిపారు. మాలిని, చిన్న మాలిని, మేడిపల్లి, రావన్‌పల్లి, లింబుగూడ, చాలపల్లి, ఇటుకల పహాడ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరించారు. ఘటనా స్థలాన్ని జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ ఎఫ్‌డీవో సాహుతో కలిసి పరిశీలించారు. పులి అడుగులను గుర్తించారు.

# నిరసనల హోరు

- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ర్యాలీలు
- దండారీ నృత్యాలు.. నిరసన తెలిపిన సమగ్రశిక్షా ఉద్యోగులు
- అమిత్‌షా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన దళిత సంఘాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమగ్ర శిక్షా ఉద్యోగులు, దళిత సంఘాల నాయకులు కన్నెర్ర చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ తీశారు. కుమ్రం భీం చౌరస్తాకు చేరుకొని దండారీ నృత్యాలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇక భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మకు దళిత సంఘాల నాయకులు చావుడప్పు కొడుతూ శవయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. అంబేద్కర్‌ను అవమాన పరుస్తూ మాట్లాడిన అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



అంబేద్కర్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

## తాండూర్‌లో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

తాండూర్, డిసెంబర్ 21 : అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో జాతీయ రహదారిపై అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం మాట్లాడుతూ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వాఖ్యలు దళితులను కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. వన్ నేషన్–వన్ ఎలక్షన్ బిల్లును తీసుకొచ్చి రాజ్యాంగాన్ని తమ చేతుల్లోకి తెచ్చుకునేలా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. అంబేద్కర్ అంటే ఎంత చిన్న చూపు ఉందో అమిత్ షా వ్యాఖ్యలతోనే అర్థమవుతుందన్నారు. ఆయనను మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు, బొల్లం రాజేశం, దుర్గం నానయ్య, కార్మికులు పాల్గొన్నారు.



తాండూర్ ఐబీలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

## సమస్యల సాధనకు పోరాడుతాం

### టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి

హాజీపూర్, డిసెంబర్ 21 : ఉద్యోగుల సమస్యల సాధన కోసం పోరాడుతామని జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ముందు సమ్మె చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను కలిసి మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావ్, రామ్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు కెజియా రాణి, నాయకులు శ్రీనివాస్, రామ్‌కుమార్, తిరుపతి, అంజయ్య, సునీత, పద్మలత, ప్రభు, వెంకట కృష్ణ, యూసఫ్, శ్రావణ్‌కుమార్, నాగుల గోపాల్, అజయ్ పాల్గొన్నారు.



సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

## బహుజన జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 21: మహారాష్ట్రలోని సిరోంచ పట్టణంలో ఈ నెల 25వ తేదీ నుంచి జరిగే బహుజన జాతరను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలో జాతర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. గత 20 ఏళ్లుగా పూలే, అంబేద్కర్, సాహూ మహరాజ్‌లాంటి బహుజన మహనీయులను స్మరిస్తూ ఈ జాతర నిర్వహిస్తున్నామని, తెలంగాణ ప్రాంత వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్ట శంకర్, కుమ్మరి శుభం, రంగు రాజేశం, దుర్గం రామ్మూర్తి, కనుకుంట్ల మల్లన్న పాల్గొన్నారు.



జాతర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బహుజన సంఘాల నేతలు




# మళ్లీ మోసానికి కాంగ్రెస్ కుట్ర

**సంక్రాంతి అనంతరం రైతు భరోసా ఇస్తామంటూ ప్రకటన**

- విధివిధానాలపై అసెంబ్లీ స్వల్పకాలిక చర్చలో ఏం చెప్పకుండా దాటవేత
- స్పష్టత ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- రుణమాఫీ లెక్కనే రైతు భరోసా చేస్తారని రైతుల మండిపాటు

మంచిర్యాల, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''మేం అధికారంలోకి వస్తే రుణమాఫీ రూ.2 లక్షలు చేస్తం. రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు ఇస్తం.. బ్యాంకుకు వెళ్లి రూ.2 లక్షలు ఇప్పుడే తెచ్చుకోండి.. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న మాఫీ చేస్తం..'' అని కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు గొప్పలు చెప్పుకున్నరు. అధికారంలోకి వచ్చి యేడాది గడిచినా పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వలేదని రైతులు మండిపడుతున్నారు. కొందరికి మాఫీ అయితే మరికొందరికి సాంకేతిక కారణాలు చూపుతూ చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రైతులను బురిడీ కొట్టించేందుకు రైతు భరోసా పేరిట కొత్త నాటకానికి తెరలేపిందని రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ అని పెట్టి అసలు విధివిధానాలే రూపొందించలేదని చెప్పడం కాంగ్రెస్ సర్కార్‌కే చెల్లుతుందన్నారు. రెండు సీజన్‌లు పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కారు.. ఇప్పుడు ఉన్నఫలంగా సంక్రాంతికి రైతు భరోసా ఇస్తుందంటే నమ్మశక్యంగా లేదని వాపోతున్నారు.

### అందరికీ భరోసా లేనట్లే..

అసెంబ్లీలో రైతుభరోసా చర్చ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను బట్టి చూస్తే రైతుభరోసా అందరికీ ఇవ్వరనేది స్పష్టంగా తెలిసిపోతుందని రైతులు వాపోతున్నారు. రుణమాఫీకి పెట్టినట్లే కొర్రీలు పెట్టి సగం మంది రైతులకే పెట్టుబడి సాయం అందించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.15వేల చొప్పున రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ కేసీఆర్ హయాంలో ఏడాదికి రూ.15 వేల కోట్ల చొప్పున రూ.72,816 కోట్లు రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాంగ్రెస్ వచ్చాక రెండు సీజన్లుగా రైతుబంధు ఊసేలేదని వాపోతున్నారు. అసెంబ్లీలో మాట్లాడేప్పుడు అసలు ప్రభుత్వం ఏం విధివిధానాలు అనుకుంటుందో చెప్పకుండా.. కేవలం గత ప్రభుత్వాన్ని విమర్శించడంపైనే సీఎం దృష్టి సారించడం ఏంటని మండిపడుతున్నారు. గతంలో రైతుబంధు రాని రైతు లేడని, అదే తరహాలో కాంగ్రెస్ సర్కార్ కూడా రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### షరతుల్లేకుండా రైతు భరోసా ఇవ్వాలి



చెన్నూర్ రూరల్, డిసెంబర్ 21 : ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రైతు భరోసా అందించాలి. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ప్రధానంగా ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. ఇకనైనా రైతు భరోసాను అమలు చేసి ఆదుకోవాలి.

*- కాళేశ్వరం సమ్మగౌడ్, కొమ్మెర రైతు*

### విధి విధానాల పేరిట కాలయాపన

*నిర్మల్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను నిలువునా ముంచింది. ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. ముఖ్యంగా రైతుబంధు స్థానంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేసి ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పారు. కానీ.. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా రైతు భరోసాను అమలు చేయలేదు. గత వానకాలం పెట్టుబడి సాయాన్ని ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. ఇప్పుడు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి రైతు భరోసా అమలు కోసం విధివిధానాలను రూపొందిస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇలాంటి ఆంక్షలు పెడతామని చెప్పలేదు కదా. కేవలం రైతులను మభ్య పెట్టేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తున్నది. వచ్చే సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటించినప్పటికీ.. రైతులకు నమ్మకం కలగడం లేదు. ఒకవేళ ఇస్తే రైతులందరికీ ఇస్తారా? కొందరికే ఇస్తారా? స్పష్టత ఇవ్వాలి. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లు ప్రతి రైతుకు పెట్టుబడి సాయాన్ని అందజేయాలి. గత వానకాలం సీజన్‌తోపాటు ప్రస్తుత యాసంగికి సంబంధించి రెండు సీజన్ల పెట్టుబడి సాయాన్ని సంక్రాంతిలోపు ఇచ్చి రైతులందరిని ఆదుకోవాలి.*

*- సునారికారి రాజేశ్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు, ఖానాపూర్.*



## మున్సిపాలిటీలో రికార్డులు పరిశీలించిన విజిలెన్స్

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 21 : మంచిర్యాల మున్సిపాలిటీలో శనివారం విజిలెన్స్ అధికారులు పలు రికార్డులను పరిశీలించారు. ఆయా విభాగాలకు చెందిన అధికారుల నుంచి వారికి కావాల్సిన వివరాలను సేకరించారు. కరీంనగర్ నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారులు ప్రశాంత్ (సీఐ), గిరీశ్‌రెడ్డి (తహసీల్దార్), శశిధర్ (ఏఈఈ)ల బృందం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ సమక్షంలో పన్నుల వసూళ్ల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. పన్నుల వసూళ్ల డిమాండ్, ఇప్పటి వరకు అయిన కలెక్షన్, ఇతర ఆదాయ రాబడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ రెవెన్యూ, అకౌంట్స్, శానిటరీ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన వివరాలను వారు పరిశీలించారు. సాధారణ విజిట్‌లో భాగంగానే తాము రికార్డులను పరిశీలించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

## అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

### భీమారం పోలీస్‌స్టేషన్‌లో కోతుల బాధితల సంఘం ఫిర్యాదు

భీమారం, డిసెంబర్ 21 : భీమారం అటవీ ప్రాంతం నుంచి వందలాది కోతులు వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని, గ్రామస్తులపై దాడులకు పాల్పడుతున్నాయని, ఈ విషయమై అనేకసార్లు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోతుల బాధితుల సంఘం నాయకులు, గ్రామస్తులు శనివారం సాయంత్రం భీమారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్వేతకు ఫిర్యాదు చేశారు. జిల్లా, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా అటవీశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని, వారిపై కేసు నమోదు చేయాలని కోరారు. కోతుల వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని, ఈ సమస్య నుంచి కాపాడాలని వారు కోరారు.



అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

## రక్షణ సూత్రాలు పాటించాలి

- సింగరేణి రక్షణ తనిఖీ బృందం అధికారులు
- తాండూర్ ఏరియా వర్క్‌షాప్‌లో పక్షోత్సవాలు

తాండూర్, డిసెంబర్ 21 : రక్షణ సూత్రాలను ఉద్యోగులు నిత్యం పాటించాలని రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ ఎన్ దామోదర్ రావు (జీఎం(ఈఅండ్ఎం), బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం తాండూర్ మండలంలోని ఏరియా వర్క్‌షాప్‌ను సందర్శించారు. అనంతరం ఆవరణలో 55వ రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రథమ చికిత్స చేసే విధానాన్ని పరిశీలించారు. సీపీఆర్ చేసే విధానాన్ని చూసి ఉద్యోగులను అభినందించారు. అనంతరం ట్రేడ్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాకారులు పాటలు, నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యోగ కళాకారుల ప్రదర్శనను తనిఖీ బృంద సభ్యులు ప్రశంసించి బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ఎస్ తిరుపతి, ఎస్‌వోటూజీఎం కే రాజమల్లు, ఇంజినీర్ భీం రావ్ జాడే, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణ మూర్తి పాల్గొన్నారు.



ఏరియా వర్క్‌షాప్‌ను సందర్శిస్తున్న సింగరేణి రక్షణ తనిఖీ అధికారులు

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

### శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్, డిసెంబర్ 21 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని శ్రీరాంపూర్ జీఎం లోతువెంకట సూర్యనారాయణ కోరారు. శనివారం శ్రీరాంపూర్ ఆర్కే 8 డిస్పెన్సరీలో ఎంవీటీసీలో శిక్షణ పొందుతున్న కారుణ్య ఉద్యోగ శిక్షకులతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, జీఎం పాల్గొని ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ యువకులు సామాజిక సేవా దృక్పథంతో రక్తదానం చేయాలన్నారు. ఎంవీటీసీలో శిక్షణ ఇస్తున్న రాజ్‌కుమార్ అనేకసార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రక్తదానం చేసిన 45 మందికి జీఎం సూర్యనారాయణ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. సంస్థలో ఉద్యోగందొరకడం అదృష్టంగా భావించి అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏస్‌వోటూజీఎం సత్యనారాయణ, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, డీవైజీఎం అరవిందరావు, ఎంవీటీసీ మేనేజర్ వెంకటరామారావు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, రెడ్ క్రాస్ సభ్యులు కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



రక్తదానం చేసిన కారుణ్య ఉద్యోగులు

## వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

### ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

వాంకిడి, డిసెంబర్ 21 : ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అన్నారు. శనివారం వాంకిడి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం, వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. వంట గదులు, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. కాలం చెల్లిన, నాసిరకం వస్తువులను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అదనంగా 10 మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ రియాజ్ అహ్మద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, వసతి గృహ సంక్షేమ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే